అక్షర దర్బార్

వెల ₹5

www.aksharadarbar.com

voice of the people

శుక్రవారం 21, ఫిబ్రవరి 2025 | సంపుటి :02 | సంచిక :13 | పేజీలు :05

తండ్రి బాటలో విప్లవోద్యమంలోకి..

- సెంట్రల్ కమిటీ మెంబర్ కొసా గ్రూప్ కమాండర్ సరెండర్
- వరంగల్ పోలీసుల ఎదుట వంజెం కేషా లొంగుబాటు
- జిన్ని తలపై రూ.4 లక్షల రివార్డ్
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ
- మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ

02

అభివృద్ధిపై చర్చకు రెడీ

- తప్పయితే ముక్కు నేలకు రాస్తా..
- ఎవరొస్తారో రండి.. చర్చ పెడుదాం..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు సవాల్

04

2 నెలలు 10 హత్యలు

ఉమ్మడి జిల్లాలో సంచలనం సృష్టిస్తున్న వరుస ఘటనలు

పట్టపగలే దారుణాలు.. పోలీస్ నిఘా వ్యవస్థపై ప్రశ్నలు

- నగరంలోనే ఇటీవల రెండు మర్డర్లు
- నిన్న గ్రేటర్ వరంగల్ పరిధిలో మూడు చోట్ల కత్తుల దాడులు
- ముగ్గురి పరిస్థితి విషమం !
- కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న నేరాలు
- భూవివాదాలు, ఆస్తి గొడవలే ప్రధాన కారణం
- చావుకు దారితీస్తున్న వివాహేతర సంబంధాలు

02

వరుస హత్యలు, దాడులు, దోపిడీలతో వరంగల్ వణుకుతున్నది. ఉమ్మడి జిల్లాతోపాటు పోలీసు కమిషనరేట్ పరిధిలో రోజు ఏదో ఒక చోట హత్య లేదా హత్యాయత్నం, చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వరుస సంఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇక నగరంలో నేరాలు నిత్యకృత్యంగా మారాయి. గత డిసెంబర్‌లో రంగంపేట ప్రాంతంలో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి, కరీమాబాద్ ప్రాంతంలో బీహార్ కార్మికుడు, కాజీపేట మండలం అమ్మవారిపేటలో వృద్ధురాలు, జనవరిలో హన్మకొండలో ఆటోడ్రైవర్ దారుణ హత్యకు గురయ్యారు. రెండు రోజుల క్రితం హన్మకొండ హంటర్ రోడ్డులో మరో ఆటోడ్రైవర్ తన ఆటోలోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈక్రమంలోనే నిన్న గ్రేటర్ వరంగల్ పరిధిలో మూడు వేర్వేరు చోట్ల కత్తుల దాడులు కలకలం రేపాయి. ఈ దాడుల్లో ముగ్గురు యువకుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పట్టపగలే దారుణాలు జరుగుతుండగా, పోలీస్ నిఘా వ్యవస్థపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరుస ఘటనలు డిపార్ట్‌మెంట్‌కు సవాల్ విసురుతున్నాయి.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

పోడుకు రూ.7 లక్షల డీల్!

- మధ్యవర్తి ద్వారా ఓ అధికారికి రూ.5 లక్షలు అప్పగింత
- మరో రూ.2 లక్షలు ఇవ్వాల్సి ఉందన్న పోడుదారులు
- రూ.2 లక్షలు ఇవ్వటం లేదని దాడికి దిగారని ఆరోపణ
- భూపాలపల్లి జిల్లాలో మరో పోడు వివాదం
- చర్చనీయమైన అటవీశాఖ అధికారి తీరు

05

భూపాలపల్లి జిల్లాలో అటవీశాఖ అధికారుల తీరు మరోసారి వివాదానికి దారి తీసింది. పోడు వ్యవసాయానికి సహకరిస్తామని చెప్పి అటవీ శాఖలోని ఓ అధికారి తమతో రూ.7 లక్షలు డీల్ కుదురుకున్నారని పోడుదారులు ఆరోపించారు. ఒప్పందం మేరకు ఓ మధ్యవర్తి ద్వారా రూ.5 లక్షలు సదరు అటవీశాఖ అధికారికి ముట్ట చెప్పామని, మరో రూ.2 లక్షలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. రూ.2 లక్షల కోసం ఆ అధికారి అటవీశాఖలోని సహచరులతో కలిసి తమపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం తనకు డబ్బులు ఇవ్వడం లేదనే కారణంతోనే అటవీ అధికారి దాడికి దిగి విచక్షణ రహితంగా తమను చితకబాదినట్లు మీడియాకు చెప్పారు. అయితే పోడుదారుల ఆరోపణలో నిజం లేదని అటవీ అధికారి అన్నారు. ప్రస్తుతం ఈ అంశం భూపాలపల్లి జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

- అక్షరదర్బార్, హనుమకొండ

నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- పకడ్బందీ వ్యూహంతో నేతలు ముందుకెళ్లాలి
- ప్రతీ 50 మంది ఓటర్లకు ఇన్‌చార్జిగా నియమించుకోవాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- బోథ్ పట్టణంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

05

తండ్రి బాటలో విప్లవోద్యమంలోకి..

- సెంట్రల్ కమిటీ మెంబర్ కొసా గ్రూప్ కమాండర్ సరెండర్
- వరంగల్ పోలీసుల ఎదుట వంజెం కేషా లొంగుబాటు
- జిన్ని తలపై రూ.4 లక్షల రివార్డ్
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా
- మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ

అక్షరదర్బార్, హన్మకొండ : మావోయిస్టు పార్టీ గొత్తికొయ ఏరియా కమిటీ సభ్యురాలు, కేంద్ర కమిటీ సభ్యుడు కదారి సత్యనారాయణరెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా ఆలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు శుక్రవారం సీపీ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, పామెడ్ మండలం రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా తండ్రి హిడ్మా కూడా (ప్రస్తుతం ఇతను జైలులో ఉన్నాడు) మావోయిస్టు పార్టీలో పనిచేసే వాడు. దీంతో కేషా 2017లో మావోయిస్టు పార్టీలో చేరింది. రెండేళ్ల పాటు పున్నెం జోగ అధ్వర్యంలో చైతన్య నాట్యమండలిలో పనిచేసింది. ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసింది. కేంద్ర కమిటీ సభ్యుడు కదారీ సత్యనారాయణ రెడ్డికి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించింది. 2021లో కేంద్ర మవోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించింది. 2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను (ప్రస్తుతం మహరాష్ట్ర జైలులో ఉన్నాడు) వివాహం చేసుకోని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పని చేశారు. అనంతరం 2024 ఏప్రిల్‌లో తిరిగి కేంద్ర కమిటీ సభ్యుడు కొసా ప్రొటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టింది.

నేరాల వివరాలు

పార్టీలో పనిచేసిన సమయంలో కొహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో కలిసి పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడిన ఘటనలో జిన్ని ఉన్నారు. అలాగే అబుజ్‌మడ్‌లో ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడు. రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితులుకావడంతో పాటు, ప్రధానంగా తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్దానంతో లొంగిపోయినట్లు సమాచారం. వంజెం కేషాపై రూ. 4 లక్షల ప్రభుత్వ రివార్డు ఉన్నట్లుగా సీపీ వెల్లడించారు.

రెండు నెలలు పది హత్యలు

- ఉమ్మడి జిల్లాలో సంచలనం సృష్టిస్తున్న వరుస ఘటనలు
- నగరంలోనే ఇటీవల రెండు మర్డర్లు
- నిన్న గ్రేటర్ వరంగల్ పరిధిలో మూడు చోట్ల కత్తుల దాడులు
- ముగ్గురి పరిస్థితి విషమం !
- కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న నేరాలు
- భూవివాదాలు, ఆస్తి గొడవలే ప్రధాన కారణం
- చావుకు దారితీస్తున్న వివాహేతర సంబంధాలు
- పట్టపగలే దారుణాలు.. పోలీస్ నిఘా వ్యవస్థపై ప్రశ్నలు

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: వరుస హత్యలు, దాడులు, దోపిడీలతో వరంగల్ వణుకుతున్నది. ఉమ్మడి జిల్లాతో పాటు పోలీసు కమిషనరేట్ పరిధిలో రోజు ఏదో ఒక చోట హత్య లేదా హత్యాయత్నం, చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వరుస సంఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇక నగరంలో నేరాలు నిత్యకృత్యంగా మారాయి. గత డిసెంబర్‌లో రంగంపేట ప్రాంతంలో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి, కరీమాబాద్ ప్రాంతంలో బీహార్ కార్మికుడు, కాజీపేట మండలం అమ్మవారిపేటలో వృద్దురాలు, జనవరిలో హన్మకొండలో ఆటోడ్రైవర్ దారుణ హత్యకు గురయ్యారు. రెండు రోజుల క్రితం హన్మకొండ హంటర్ రోడ్డులో మరో ఆటోడ్రైవర్ తన ఆటోలోనే ఆనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈక్రమంలోనే నిన్న గ్రేటర్ వరంగల్ పరిధిలో మూడు వేర్వేరు చోట్ల కత్తుల దాడులు కలకలం రేపాయి. ఈ దాడుల్లో ముగ్గురు యువకుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పట్టపగలే దారుణాలు జరుగుతుండగా, పోలీస్ నిఘా వ్యవస్థపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరుస ఘటనలు డిపార్ట్‌మెంట్‌కు సవాల్ విసురుతున్నాయి.

కత్తులతో దాడులు..

గ్రేటర్ వరంగల్ పరిధిలో గురువారం పలుచోట్ల కత్తుల దాడులు కలకలం రేపాయి. వరంగల్ పోచమ్మ మైదాన్ సమీపంలోని వాసవి కాలనీలో కుటుంబ కలహాలతో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు. అడ్డొచ్చిన అత్తమామల పైనా విరుచుకుపడ్డాడు. హసన్‌పర్తి మండలం మడిపల్లిలో జరిగిన పెళ్లి బరాత్‌లో ఇద్దరు కత్తి పోట్లకు గురయ్యారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బట్టుపల్లి రహదారిపై అమ్మవారిపేట క్రాస్ రోడ్ వద్ద కారును ఆపేసిన దుండగులు అందులోని వైద్యుడిపై రాడ్లతో దాడి చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వైద్యుడి కండిషన్ సీరియస్ గా ఉన్నట్లు సమాచారం. నిన్న ఒక్క రోజే మూడు ఘటనలు జరగడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

వరుస ఘటనలు

- ఆటోలో డెడ్ బాడీ కలకలం రేపిన ఘటన హనుమకొండ హంటర్ రోడ్డులో జరిగింది. స్థానికులు బుధవారం సుబేదారి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెళ్లి విచారణ చేపట్టారు. ఆటోలో లభించిన లైసెన్స్ ఆధారంగా మృతుడు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన ముల్కల ఉప్పలయ్యగా గుర్తించారు.
- ఈనెల 20న భూపాలపల్లి జిల్లాలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి (50) దారుణ హత్యకు గురయ్యాడు. భూవివాదాల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఐదుగురిపై ఎఫ్ ఐఆర్ నమోదుచేశారు. ఇద్దరు నిందితులు లొంగిపోయినట్లు సమాచారం.
- జనవరి 22న పట్టపగలే వరంగల్‌లో ఓ ఆటోడ్రైవర్ హత్యకు గురయ్యాడు. ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు తేల్చారు. ఇదే మహిళతో సంబంధం ఉన్న మరో ఆటో డ్రైవర్ ఈ హత్య చేసినట్టు గుర్తించి అరెస్ట్ చేశారు.
- గత డిసెంబర్ 20న భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపూర్ శివారులోని అడవిలో మహిళ హత్యకు గురైంది. వివాహేతర సంబంధం కారణంగానే శైలజ (38) హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడు అదే రోజు పోలీసులకు లొంగిపోయాడు.
- బీహార్‌కు చెందిన వలస కూలీ వరంగల్ కరీమాబాద్‌లో డిసెంబర్ 20న హత్యకు గురయ్యాడు. ఓ మహిళతో చనువుగా ఉంటున్నాడని అనుమానించిన ఆమె భర్త పథకం ప్రకారం యువకుడు మునిదిల్‌ఖుష్ కుమార్ (16)ను నరికి హత్య చేశాడు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.
- డిసెంబర్ 14న భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లిలో రైతు దారుణ హత్యకు గురయ్యాడు ఐదు గంటల భూమి కోసం సొంత అన్న మారపాక సారయ్య (50)ని తమ్ముడు, ఆయన భార్య కలిసి కిరాతకంగా నరికి చంపారు.
- డిసెంబర్ 2న వరంగల్‌లో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎలిగేటి రాజమోహన్ (64) హత్యకు గురయ్యాడు. వరంగల్ నగరంలో కలకలం సృష్టించిన మర్డర్ మిస్టరీని అదే నెలలో పోలీసులు ఛేదించారు. అప్పు ఇస్తానని చెప్పి ఇవ్వనందుకే ములుగు జిల్లాకు చెందిన నిందితుడు పథకం ప్రకారం వృద్ధుడిని హత్య చేసినట్లు అంగీకరించాడు.
- డిసెంబర్ 21న హన్మకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామంలో మైదం సంతోష(55)ను ఆమె భర్త మైదం కొమరయ్య ఇంట్లోనే ఉరివేసి చంపేశాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.
- అనుమానంతో ఓ ప్రబుద్ధుడు భార్య అనూష (30)కు ఉరివేసి హత్య చేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో డిసెంబర్ 2న చోటుచేసుకుంది.
- వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నవంబర్ 30న భార్య కుమార్తె కలిసి పథకం ప్రకారం అంతమందించారు. ఇంట్లోనే నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రపల్లిలో నవంబర్ 28న యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నడిరోడ్డుపై ఇద్దరు వ్యక్తులు కత్తితో పొడిచి చంపారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు.

జర్నలిస్టులకు ఆకాశమే హద్దు..

సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

అక్షర దర్బార్, వరంగల్ : జర్నలిస్టులకు ఆకాశమే హద్దు అని, లిమిట్స్ ఉండవని, సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు మాత్రమే అని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్ డేకు ఆయన హాజరై మాట్లాడారు. జర్నలిజం విద్యార్థులకు లీడర్షిప్ క్వాలిటీస్ ఉంటాయని సమస్యల మీద ఎప్పటికప్పుడు ముందుంటారని,ఆ సమస్యల పరిష్కారానికి పాటుపడతారని అన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్ గా క్లాసులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్ మాట్లాడుతూ అన్ని కోర్సుల కంటే జర్నలిజం కోర్స్ ముఖ్యమైనదని, దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ సి డైరెక్టర్ ఐలయ్య, కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సుధాకర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి తో పాటు మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శివ కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

కలెక్టర్ కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

అక్షరదర్బార్, గణపురం: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న శివ కళ్యాణ మహోత్సవానికి హాజరవ్వాలని కోరుతూ కలెక్టర్ రాహుల్ శర్మకు, ఎస్పీ కిరణ్ ఖరేకు, భూపాలపల్లి డీఎస్పీ అవిరినేని సంపత్ రావు, భూపాలపల్లి, చిట్యాల సీఐలు దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, దగ్గు మల్లేష్ ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సత్కరించి ఆలయ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో కోటగుళ్ల ఆలయ పోషకులు డాక్టర్ కోదూరు నవీన్ కుమార్, కోటగుళ్ల పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

అక్షర దర్బార్,శాయంపేట : భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్య విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మైలారం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ రాజలింగమూర్తి హత్యను రాజకీయం చేయడం మంచిది కాదని, హత్యకు భూవివాదాలే కారణమని స్థానిక ప్రజలు, పోలీసులు చెప్తున్నప్పటికీ కావాలని కాంగ్రెస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్రపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మీ అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి మాజీ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు చల్ల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మన్నె సదయ్య నాయకులు మోతే సమ్మయ్య, మోహన్ రెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ కుమార్ పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం రోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. సిరంగి సంతోష్ కుమార్ వారి కుటుంబ సభ్యులు పరమర్శించారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల బిజెపి అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, బీజేపీ నాయకులు తండ కుమారస్వామి, ఎదునూరి లింగయ్య, చిర చక్రపాణి, మల్లారెడ్డి, జన్ను లింగయ్య, సాయి కుమార్, ప్రమోద్ కుమార్, కొమురయ్య, తడుక సురేష్, విజయ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

అక్షర దర్బార్,తొర్రూరు: మండలంలోని చెర్లపాలెం గ్రామంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహన్ని శుక్రవారం తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ డైనింగ్ హాల్ శుభ్రంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. పిల్లల పట్ల వార్డెన్ శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ కట్టా స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డి పరామర్శ..

అక్షర దర్బార్, నెక్కొండ : నెక్కొండ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావుల మధుకర్ రెడ్డి కుమారుడు అరవింద్ రెడ్డి ప్రథమ వర్ధంతికి పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనవెంట నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరు సాయికృష్ణ కుసుమ చెన్నకేశవులు చల్ల బాపిరెడ్డి మెరుగు విజయ్ పోలిశెట్టి ప్రతాప్ బోడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

షాపును పరిశీలిస్తున్న సీఐ దేవేందర్

దొంగల హల్ చల్

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్ లో శ్రీ సాయి బాలాజీ డ్రై ఫ్రూట్స్ కిరాణం షాపులో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం షాపును పరిశీలించారు. తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు రూ.60వేల విలువైన డ్రై ఫ్రూట్స్, సీసీ పుటేజ్ హార్డ్ డిస్క్ తో సహా ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ కు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గుడ్ బై

పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హస్తం పార్టీకి రాజీనామా చేశారు. ఇకపై ఏ పార్టీలో చేరకుండా స్వతంత్రంగా ఉంటానని వెల్లడించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల వల్లే కోనప్ప రాజీనామాకు దారి తీశాయని తెలుస్తోంది. 2023లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో తనపై బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడంతో అసంతృప్తికి గురైన కోనప్ప సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఏడాది గడవకుండానే కోనప్ప హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి..

నాచారంలో అలుముకున్న విషాదఛాయలు

అక్షర, దర్బార్ మల్హర్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన మండలంలోని నాచారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పుల జయ-చంద్రం దంపతుల కుమారులు రాజు(25), శంకర్ (22) ఇద్దరు అన్నదమ్ములు హన్మకొండలో ఉంటున్నారు. రాజు ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు, శంకర్ ఐటిఐ చదువుతున్నాడు. గురువారం ఇద్దరు అన్నదమ్ములతో పాటు కాటారం మండలం గంగారాం గ్రామానికి చెందిన స్నేహితుడు శివ బైక్ పై ముగ్గురు స్వగ్రామానికి బయల్దేరి వస్తున్న క్రమంలో అర్ధరాత్రి కంఠాత్మకూర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి శివకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గీత కార్మికుడికి గాయాలు

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన పల్లె రవీందర్ గౌడ గురువారం సాయంత్రం తన వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో గాయపడిన ఆయనను స్థానికులు హాస్పిటల్ తరలించారు. ఈ సందర్భంగా గౌడ కార్మికులు పల్లె వెంకన్న, కత్తి వీరస్వామి, ఆకుల శ్రీనివాస్, పల్లె రాజులు మాట్లాడుతూ రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి : సీపీఎం

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మిర్చి పంటకు క్వింటాకు 25 వేల రూపాయలు గిట్టుబాటు ధర చెల్లించాలని, మిర్చిని వ్యాపార పంటగా కాకుండా ఆహార పంటగా గుర్తించి మిర్చి బోర్డును వెంటనే ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణను చేపట్టాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కురవి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కార్యాలయ అధికారి గణేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు మాట్లాడుతు మండలంలో సుమారు 8వేల ఎకరాలలో మిర్చి పంటను రైతులు పండించారని, మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మలేడి కోటయ్య నాయకులు నల్లపు సుధాకర్, కడియం సత్యం, రాయల మనోహర్, పోతుగంటి మల్లయ్య, మాలోత్ కిషన్, కట్ల కృష్ణయ్య, గంధసిరి శ్రీనివాస్, తగరం తిరుపతి, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు గులాబీ పువ్వులు ఇస్తున్న డీఎం

కర్టసీ డే శుభాకాంక్షలు

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట డిపో బస్టాండ్ ఆవరణలో శుక్రవారం కర్టసి డే (మర్యాదపూర్వకమైన) సందర్భంగా నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ప్రయాణికులకు గులాబీ పుష్పాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిపోలో గేట్ మీటింగ్ కార్యక్రమంలో ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. బస్సులో ప్రయాణికుల పట్ల మర్యాదగా ఉంటూ చిరునవ్వు తో పలకరించే విధంగా డ్యూటీ చేయాలని కోరారు. బస్సులో ప్రయాణికులకు డిపో సిబ్బంది తేజశ్విని, ఉమాదేవి, రాంబాబు, నరేందర్ తో కలిసి గులాబీ పుష్పాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ భవానీ, సెక్యూరిటీ హెడ్ వీరారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు రెడీ

- తప్పయితే ముక్కు నేలకు రాస్తా..
- ఎవరొస్తారో రండి.. చర్చ పెడుదాం..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండికి సవాల్

అక్షరదర్బార్, పాలమూరు: పాలమూరు అభివృద్ధిపై ఎవరొస్తారో రండని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నారాయణపేట అంబేద్కర్ చౌరస్తాలోనే చర్చ పెడుదామని అన్నారు. కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేదికాదన్నారు. అన్నిరంగాల్లో మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. నారాయణపేటలో ఇవాళ పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశంలోనే మొదటిసారి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మహిళలు ఆత్మగౌరవంతో బతుకుతారని తమ ప్రభుత్వం ప్రగాఢంగా నమ్ముతోందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో మహిళా శక్తి 67 లక్షల మంది ఉన్నారని చెప్పుకొచ్చారు. 600 ఆర్టీసీ బస్సులకూ మహిళలను యజమానులను చేశామని గుర్తుచేశారు. వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి శిల్పారామం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి ఇచ్చామన్నారు. త్వరలోనే మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏడాదికి రెండు చీరలు కానుకగా ఇవ్వనున్నామని ప్రకటించారు. సొంత ఆడబిడ్డలకు అందించినట్లు నాణ్యమైన చీరలను అందించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కమిషనర్ కు సీపీఎం వినతి

అక్షర దర్బార్, పరకాల: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ గృహ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ పరకాల పట్టణంలో మున్సిపల్ పరిధిలో 4,9,15,18,19, వార్డుల పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయని, వ్యాపార సముదాయాలు సైతం అనుమతి మేరకు కాకుండా ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తున్నారు. పరకాల టౌన్ ప్లానింగ్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అనేక నిర్మాణాలు అనుమతులు లేకుండానే పట్టణ పరిధిలో కొనసాగుతున్నాయి. నూతన భవన నిర్మాణాల పట్ల విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హేమంత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కమిషనర్ కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

బాయర్ వయోగో క్షేత్ర ప్రదర్శన

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మండలంలోని మహమూద్ పట్నం గ్రామంలో వాంకుడోతు నరేష్ వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం బాయర్ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. వరిలో మొగిపురుగు నివారణకు వయోగో మందు పని చేస్తుందని కంపెనీ ప్రతినిధి సీసీఎం సతీష్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు, కంపెనీ ప్రతినిధులు, సేఫ్టీ శ్రీనివాస్, సూపర్ వైజర్ శ్రీకాంత్, సురేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాకు శుభాకాంక్షలు

అక్షర దర్బార్, పరకాల : ఢిల్లీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేఖ గుప్తాకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు హనుమకొండ జిల్లా బిజెపి కార్యదర్శి, ఆర్య వైశ్య యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రామన్న పేర్కొన్నారు. ఢిల్లీలో వైశ్య బిడ్డను ముఖ్యమంత్రిని చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి ఆర్యవైశ్య సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న దుగ్గొండి రూరల్ సీఐ సాయి రమణ

ప్రజా సేవలో పోలీసులు ముందుండాలి

దుగ్గొండి రూరల్ సీఐ సాయి రమణ

అక్షర దర్బార్, దుగ్గొండి : ప్రజా సేవలో పోలీసులు ముందుండాలని దుగ్గొండి రూరల్ సీఐ సాయి రమణ సూచించారు. శుక్రవారం మండలం చలపర్తి గ్రామంలో గ్రామల వారీగా నియమించిన పోలీసుల వివరాలతో కూడిన వాల్ పోస్టర్లను సిఐ సాయి రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిఐ సాయి రమణ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు విలేజ్ పోలీస్ ఆఫీసర్ (విపిఓ) లుగా నియమించినట్లు తెలిపారు. ప్రజలు పోలీస్ విపిఓ ఫోన్ నెంబరు అందుబాటులో ఉంచుకోవాలని, వీపిఓ అధికారి డయల్ 100 , 108 సర్వీస్ లాగా పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై నీలోజి వెంకటేశ్వర్లు,దుగ్గొండి కానిస్టేబుల్స్ ,గ్రామ పోలీస్ అధికారి వేణు కుమార్, రంజిత్ కుమార్, రాజ్ కుమార్, వీరస్వామిలు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

అక్షర దర్బార్, తొర్రూరు : విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని వెలికట్ట ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా గొల్లపల్లి అమృత వర్షిణి, ఎంఈఓగా వనమాల అద్రిత్, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం ఉమాదేవి అభినందించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్వయం పరిపాలన దినోత్సవం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, ఇబ్రహీం, చంద్రశేఖర్, రాకేష్ కుమార్, రాణి, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్జీ కళాశాలలో ఫుడ్ పాయిజన్ !

కిషన్ పుర మహిళా క్యాంపస్ లో ఘటన

25 మంది విద్యార్థినులకు అస్వస్థత

అక్షరదర్బార్, హన్మకొండ: కిషన్‌పురలోని ఆర్జీ మహిళా జూనియర్ కాలేజీలో 25 మంది విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రికి తరలించారు. తల్లి దండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయికి ఫీవర్ వచ్చింది, వచ్చి తీసుకెళ్లండి అని సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఇంటికి వెళ్లిన విద్యార్థినులు కడుపునొప్పితో బాధపడుతుండగా అసలు విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే హనుమకొండలోని ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు విద్యార్థినుల బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు విద్యార్థులను పరామర్శించి, కళాశాల ఎదుట ఆందోళనకు దిగాయి. కళాశాలలను మూసివేయాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు.

పోడుకు రూ.7 లక్షల డీల్!

- మధ్యవర్తి ద్వారా ఓ అధికారికి రూ.5 లక్షలు అప్పగింత
- మరో రూ.2 లక్షలు ఇవ్వాల్సి ఉందన్న పోడుదారులు
- రూ.2 లక్షలు ఇవ్వటం లేదని దాడికి దిగారని ఆరోపణ
- భూపాలపల్లి జిల్లాలో మరో పోడు వివాదం
- చర్చనీయమైన అటవీశాఖ అధికారి తీరు

అక్షరదర్బార్, హనుమకొండ : భూపాలపల్లి జిల్లాలో అటవీ శాఖ అధికారుల తీరు మరోసారి వివాదానికి దారితీసింది. పోడు వ్యవసాయానికి సహకరిస్తామని చెప్పి అటవీ శాఖలోని ఓ అధికారి తమతో రూ.7 లక్షలు డీల్ కుదురుకున్నారని పోడుదారులు ఆరోపించారు. ఒప్పందం మేరకు ఓ మధ్యవర్తి ద్వారా రూ.5 లక్షలు సదరు అటవీశాఖ అధికారికి ముట్ట చెప్పామని, మరో రూ.2 లక్షలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. రూ.2 లక్షల కోసం ఆ అధికారి అటవీశాఖలోని సహచరులతో కలిసి తమపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం తనకు డబ్బులు ఇవ్వడం లేదనే కారణంతోనే అటవీ అధికారి దాడికి దిగి విచక్షణ రహితంగా తమను చితకబాదినట్లు మీడియాకు చెప్పారు. అయితే పోడుదారుల ఆరోపణలో నిజం లేదని అటవీ అధికారి అన్నారు. ప్రస్తుతం ఈ అంశం భూపాలపల్లి జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

- ఏం జరిగిందంటే..

భూపాలపల్లి జిల్లాలోని ఆజాంనగర్ అటవీ రేంజ్ పరిధిలో కొంతమంది రైతులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. అయితే వీరిలో కొందరిని ఇదే రేంజ్ పరిధిలోని ఓ అటవీ అధికారి పిలిచి అటవీ భూమిలోని చెట్లను తొలగించి మీరు పోడు పోడు వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. చాలా ఏళ్ల నుంచి ఈ భూమిలో తాము వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామని, తాజాగా పోడు చేసిన భూమి కాదని సదరు రైతులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆ రైతులు అటవీశాఖ అధికారులు తమ జోలికి రాకుండా ఉండేందుకు తలా కొంత డబ్బు సమకూర్చుకొని సమర్పించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఓ మధ్యవర్తి ద్వారా అటవీ శాఖలోని ఓ స్థానిక అధికారితో రూ.ఏడు లక్షలు డీల్ కుదిరినట్లు తెలిసింది. ఈ మేరకు రైతులు కొందరు రూ.50 వేల చొప్పున జమచేసి గత జూలై నెలలో తొలి విడత సదరు అటవీ అధికారికి అప్పగించినట్లు సమాచారం. ఇంకో రూ.రెండు లక్షలు ముట్ట చెప్పాల్సి ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ డబ్బు ఇవ్వటం లేదని తాజాగా అటవీశాఖ అధికారులు ఆజంనగర్ రేంజ్ పరిధిలో ఆ పోడు రైతులు సాగు చేస్తున్న భూముల్లో తాజాగా జేసీబీతో దాడికి దిగారు. ఫలితంగా పోడుదారులు, అటవీ శాఖ అధికారుల మధ్య ఘర్షణ జరిగింది. ఇది చిలికి చిలికి గాలివానగా మారింది. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కూడా అటవీశాఖ అధికారుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీనిపై శుక్రవారం పోడుదారులు మీడియాతో మాట్లాడుతూ ఆజాంనగర్ రేంజ్ పరిధిలోని అటవీ అధికారి ఉషకు రూ.ఏడు లక్షల డీల్ లో భాగంగా రూ. 5 లక్షలు ముట్టాయని మీడియాకు చెప్పారు. ఆమె మిగితా రూ.రెండు లక్షల కోసం దాడికి దిగి తమను సహచరులతో కలిసి తీవ్రంగా కొట్టినట్లు తెలిపారు. ఇందులో నిజం లేదని సదరు అటవీ అధికారి ఉష అన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై వివాదం తలెత్తింది.

ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

మండలి ఎన్నికల ప్రచారంలో మనోళ్లు..

- వరంగల్ జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జి బాధ్యతలు
- కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో నాయిని, రేవూరి, గండ్ర, నాగరాజు ప్రచారం
- ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం వ్యూహాలు
- లీడర్లు, క్యాడర్లు సమన్వయం చేసుకుంటూ ముందుకు..
- ఉత్కంఠ రేపుతున్న టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి : గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. గతంలో ఎప్పుడూ లేనంత హడావుడి ఇప్పుడు కనిపిస్తోంది. రెండుసార్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటమేగాక ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. ఈక్రమంలోనే ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రాడ్యుయేట్ సిట్టింగ్ సీటును తిరిగి నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ .. ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుని తెలంగాణలో పట్టు పెంచుకోవాలని బీజేపీ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రచారానికి మూడు రోజులే మిగిలి ఉండటంతో అభ్యర్థులు వారికి మద్దతుగా ఆయా పార్టీల నేతలు స్పీడ్ పెంచారు. ఈక్రమంలోనే కరీంనగర్–మెదక్–నిజామాబాద్– ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తమకు కేటాయించిన సెగ్మెంట్లలో కాంగ్రెస్ గెలుపు బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. నరేందర్‌రెడ్డి గెలుపు కోసం వ్యూహాలకు పదునుపెడుతున్నారు.

కీలక బాధ్యతలు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నిజామాబాద్ జిల్లా బాల్కొండ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కరీంనగర్ జిల్లా హుజురాబాద్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదిలాబాద్ జిల్లా బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించారు. తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నేతలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని, భవిష్యత్ అంతా కాంగ్రెస్ దేనని దిశానిర్దేశం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఇవాళ కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, పట్టణంతోపాటు వీణవంక మండల కో ఆర్డినేటర్ల సమీక్షసమావేశంలో ఎమ్మెల్యే రేవూరి పార్టీ శ్రేణులతో సమీక్షించారు. అదేవిధంగా.. ఈనెల 27న జరగనున్న ఉమ్మడి మెదక్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల బోథ్ నియోజకవర్గ ఇంచార్జీ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం బోథ్ పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఎన్నిక చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకొని సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టేలా పనిచేయాలని కోరారు.

ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

సర్వోత్తంరెడ్డిని గెలిపించాలి

- బీజేపీ నేత డాక్టర్ సంతోష్ కుమార్

అక్షరదర్బార్, ఆత్మకూర్: నల్గొండ– వరంగల్– ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు నీరుకుల్ల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సదానందం, నేతలు బి రాజు, వంగాల బుచ్చిరెడ్డి, టి సత్యనారాయణ, బయ్య పైడి, మహేందర్ పాల్గొన్నారు.

323 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

అక్షరదర్బార్, ములుగు : గోవిందరావుపేట మండలం మొద్దుల గూడెం శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెట్రోలింగ్ చేస్తుండగా గుండాల నుండి మొద్దులగూడెం వైపు వస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్ వల్లెపు బంగారిని అదుపులోకి తీసుకొని విచారించగా 323 క్వింటాళ్ల 50 కిలోల పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్టు చెప్పాడు. కొత్తగూడెం జిల్లాకు చెందిన బత్తుల రాజు ఇల్లందు చుట్టుపక్కల గ్రామాల నుండి పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొని మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఎక్కువ ధరకు అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ 323 క్వింటాళ్ల 50 కిలోల పీడీఎస్ బియ్యం విలువ సుమారు 6,47 వేలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915